క్లుప్తంగా

నేడు తెలంగాణ రన్

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం పోలీస్ శాఖ నేతృత్వంలో తెలంగాణ రన్ నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ నుండి ప్రారంభమై ఐడీపీఎల్ చౌరస్తా, అక్కడ నుండి తిరిగి మున్సిపల్ గ్రౌండ్‌లో రన్ ముగియనుంది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ లు ముఖ్య అతిథులుగా హాజరై రన్‌ను ప్రారంభిస్తారు.

ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం

జగద్గిరిగుట్ట: ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. డివిజన్ పరిదిలోని మైసమ్మనగర్ బి బ్లాక్‌లో ఆదివారం సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సృజన వెల్ఫర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, జనరల్ సెక్రటరీ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేస్తున్న డైరెక్టర్ డాక్టర్ వీఎస్‌కే రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావులు

సుభాష్‌నగర్: మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎంఆర్‌సెట్) కళాశాలలో ఆదివారం ఎంబీఏ, బీటెక్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా జరిగింది. కళాశాల చైర్మన్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చదువుల్లో రాణించిన విద్యార్థులకు సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలేన్సీ, పట్టాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ వీఎస్‌కే రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావులు మాట్లాడుతూ తమ కళాశాలలో సుశిక్షితులైన అధ్యాపక బృందంతో అత్యుత్తమ విద్యనందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలను పరిగణనలోకి తీసుకోవాలి

జగద్గిరిగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష సాయం అందజేసే జాబితాలో పద్మశాలి కులాన్ని చేర్చకుండా అవమానించిందని తెలంగాణ స్టేట్ పద్మశాలి సంఘం వైస్ ప్రెసిడెంట్ గుదే రాజశేఖర్ అన్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జబాభా ప్రాతిపదికన అధిక ఓటింగ్ శాతాన్ని కలిగి ఉన్న పద్మశాలీలను ఎందుకు బీసీ సంక్షేమ శాఖ పరిగణలోకి తీసుకోలేదని, కేవలం ఓటు బ్యాంకుకే కాకుండా సంక్షేమ పథకాలకు చేరువయ్యే విధంగా చూడాలని ఆయన అన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న శంభీపూర్ రాజు

దుండిగల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. షాపూర్‌నగర్‌కు చెందిన శివశక్తి ధ్యాన యోగా కేంద్రం చిన్నారులు ఇటీవల తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో ప్రతిభ కనబర్చారు. జాశ్విన్ గోల్డ్, సాహితి, మానస లు సిల్వర్ మెడల్స్ సాధించగా వారిని శంభీపూర్ రాజు ఆదివారం తన కార్యాలయంలో అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం

కుత్బుల్లాపూర్: శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కండ్లకోయకు చెందిన సీఎంఆర్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం సుభాష్‌నగర్‌లోని వివేకానంద విద్యామందిర్ హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో జనరల్ ఫిజీషియన్, కంటి, పంటి, స్త్రీ సంబంధ వైద్య నిపుణులు 300 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు వైద్య సేవలు అందించాలనే సదుద్దేశంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్, సంఘం సలహాదారుడు సర్వేపల్లి రమేష్‌కుమార్, సీఎంఆర్ ఆస్పత్రికి చెంది జనరల్ ఫిజీషియన్ డాక్టర్ పవన్, డీజీఓ డాక్టర్ అలేఖ్య, పీఆర్‌ఓ దుర్గాప్రసాద్‌రెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్లు మధు, రాజనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచే బడిగంటలు..



సిద్ధంగా ఉన్న తరగతి గది..





మండల కార్యాలయంలో ఉన్న పుస్తకాలు, తరగతి గదులను శుభ్రం చేస్తున్న సిబ్బంది

దుండిగల్: వేసవి సెలవులు ముగియడంతో సోమవారం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికే విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా పాఠశాలలను పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేశారు. పాఠశాలల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి తరగతి గదులను కడిగి బెంచీలను సిద్ధం చేశారు. వేసవి సెలవుల్లో ఆడి పాడుతూ ఎంజాయ్ చేసిన విద్యార్థులు బడుల వైపు అడుగులు వేస్తున్నారు.

107 పాఠశాలలు..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్, కుత్బుల్లాపూర్, బాచుపల్లి మండలాల్లో మొత్తం 107 పాఠశాలలు ఉండగా అందులో 85 ప్రాథమిక, ఒకటి ప్రాథమికోన్నత, 21 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

విస్తృతంగా బడిబాట..

◆ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బడి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది.

◆ ఇందులో భాగంగా ఈ నెల 3 నుంచి 17వ తేదీ వరకు స్థానిక విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు.

◆ మురికివాడ ప్రాంతాలు, నిరు పేదలు, వలస కూలీలు అధికంగా నివాసముండే చోటు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

◆ ప్రైవేటు పాఠశాలల ఫీజు దోపిడి నేపథ్యంలోనూ కొందరు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గ చూపుతున్నారు.

◆ గత విద్యా సంవత్సరం 107 ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 26,018 మంది విద్యార్థులు ఉండగా అందులో 1764 మంది పదవ తరగతి పరిక్షలు రాసి వెళ్లిపోయారు.

ఇప్పటికి పూర్తి స్థాయిలో రాని పుస్తకాలు, యూనిఫాం..

◆ ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటి వరకు పుస్తకాలు, యూనిఫాం చేరలేదు. అందరి విద్యార్థులకు మొత్తం 1,35,380 పుస్తకాలు రావాల్సి ఉండగా అందులో 63,650 మాత్రమే వచ్చాయి. ఇంకా 71,730 పుస్తకాలు రావాల్సి ఉంది.

◆ గతంలో పాఠశాలలు తెరుచుకోవడానికి వారం ముందే మండల విద్యా శాఖ కార్యాలయం నుంచి ఆయా పాఠశాలలకు పుస్తకాలను పంపిణి చేసేవారు. ప్రస్తుతం పుస్తకాల కొరత కారణంగా కార్యాలయంలోనే ఉన్నాయి.

◆ యూనిఫాం సైతం 30 శాతం మంది విద్యార్థులకు మాత్రమే వచ్చాయి.

> **ఇప్పటి వరకు వెయ్యి అడ్మిషన్లు**
>
> 
>
> ఇప్పటి వరకు వెయ్యి మంది విద్యార్థులు నూతనంగా అడ్మిషన్లు తీసుకున్నారు. విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను మరింత పెంచుతాం. పాఠశాలలను ఇప్పటికే శుభ్రం చేయించాం. మరో మూడు, నాలుగు రోజుల్లో పుస్తకాలు, యూనిఫాంను పూర్తి స్థాయిలో అందజేస్తాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటాం.
>
> – ఆంజనేయులు, మండల విద్యాధికారి

బీజేపీ పాలనలో దేశం సర్వతోముఖాభివృద్ధి



కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు

రంగారెడ్డినగర్: కేంద్రంలోని బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని, విదేశాల నుండి వస్తువుల దిగుమతి స్థాయి నుండి ఎగుమతి చేసే స్థాయిని ఎదిగామని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రంగారెడ్డినగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనుల వివరాలు ముద్రించి కరపత్రాలను ప్రజలకు పంపిణి చేశారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ 2014లో కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టకముందే దేశ ఆర్థిక వ్యవస్థ దయనీయంగా ఉండేదని, పదేళ్ల బీజేపీ పాలనలో ఆర్థిక స్వలంభన సాధించడంతో పాటు మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్వదేశీ పరిశ్రమలను ప్రోత్సహించి అంతర్జాతీయస్థాయిలో దేశ కీర్తి ప్రతిష్టతలు పెంచామన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, డివిజన్ల అధ్యక్షులు పరుశ వేణు, బలరామ్, పత్తి సతీష్ పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మస్థైర్యం పెంపొందుతుంది



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

సుభాష్‌నగర్: మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందుతుందని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అన్నారు. సూరారం బ్లూమింగ్ బడ్స్ కాన్వెంట్ లో ఆదివారం కరాటే మాస్టర్ శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి కరాటే కుంగ్ఫూ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుండే మార్షల్ ఆర్ట్స్‌లో తర్ఫీదు ఇప్పించాలని, దీంతో వారిలో శరీరక పటుత్వం పెంపొందడంతో పాటు చురుకుదనం పెరుగుతుందన్నారు. కరాటే మాస్టర్లు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల కుటుంబాలకు అండగా ఉంటాం

కుత్బుల్లాపూర్: ఉద్యమకారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతినగర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు గొల్ల విద్యాసాగర్‌యాదవ్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆదివారం ప్రగతినగర్‌లోని విద్యాసాగర్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఉద్యమాలు, రాస్తారోకోల్లో పాల్గొనడమే కాకుండా పోలీసుల లాఠీ దెబ్బలు తిన్న విద్యాసాగర్ సేవలను రాష్ట్ర ప్రజలు ఎప్పుడు గుర్తించుకుంటారన్నారు. ప్రభుత్వ పరంగా ఉద్యమకారుల కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. బీఆర్‌ఎస్ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, సీనియర్ నాయకులు కొలన్ గోపాల్ రెడ్డి, సుధీర్ రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు ఉన్నారు.



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన బీజేపీ యువమోర్చా, కూకట్‌పల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి బి. శ్రీధర్

బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన బొట్టు శ్రీధర్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఆకర్షితులై కూకట్‌పల్లి డివిజన్‌కు చెందిన బీజేపీ యువమోర్చా, కూకట్‌పల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి బి. శ్రీధర్‌తో పాటు పలువురు బీజేపీ కమిటి సభ్యులు బీఆర్‌యస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకత్వంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని, ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు మాధవరం కృష్ణారావు చేసి చూపించారని, కళ్లముందు కనిపిస్తున్న అభివృద్ధి చూసి మెచ్చుకోక తప్పదని, అంతేకాకుండా ఎన్నో సంక్షేమ పథకాలతో నిరంతరం విద్యుత్ పంపిణీతో పరిశ్రమలు , పెట్టుబడులతో హైదరాబాద్ మహానగరం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపారని అన్నారు. కూకట్‌పల్లి నియోజవకర్గ కోఆర్డినేటర్ సతీస్ అరోరా, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా చెంది శ్రీనివాస్



నియామక పత్రాన్ని అందుకుంటున్న చెంది శ్రీనివాస్‌ముదిరాజ్

సుభాష్‌నగర్: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చెంది శ్రీనివాస్‌ముదిరాజ్ నియమితులయ్యారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్ జారీ చేసిన నియామక పత్రాన్ని ఆదివారం గాజులరామారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి, జిల్లా ఇంఛార్జి శాంతికుమార్, రాష్ట్ర నాయకుడు శ్రీశైలంగౌడ్, మేడ్చల్ అర్బన్, రూరల్ జిల్లాల అధ్యక్షులు పన్నాల షరీష్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డిల చేతుల మీదుగా అందుకున్నారు.

ఫుట్‌బాల్ విజేత లయోలా గుంటూరు జట్టు



టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులు

రాయదుర్గం: సీఐఎస్‌సీఈ స్కూల్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ అండర్–19 విజేతగా లయోలా గుంటూరు జట్టు నిలిచింది. గచ్చిబౌలిలోని నాసర్ బాయ్స్ స్కూల్ మైదానంలో సీఐఎస్‌సీఈ స్కూల్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్–2023ని నిర్వహించారు. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం అండర్–19 ఫుట్‌బాల్ ఫైనల్లో లయోలా గుంటూరు జట్టు– హెచ్‌పీఎస్ బేగంపేట్ జట్ల మధ్య జరగగా లయోలా గుంటూరు జట్టు 1–0 స్కోరుతో విజయం సాధించింది. ఈ విజేతలకు ఆగస్టు చివరి వారంలో గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

అల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ సభ్యుల నియామకం



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేసిన మాజీ కార్పొరేటర్ వెంకటరావు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ షఫీ ఉద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్ కమిటీ సభ్యులు నియామకం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు, బి బ్లాక్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేంద్రలు పాల్గొని నియామక పత్రాలు అందజేశారు. వైస్ ప్రెసిడెంట్‌లుగా మొహమ్మద్ మొయినుద్దీన్, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మయ్య, సుల్తాన్, జనరల్ సెక్రటరీలుగా గిరి, షషం కనకయ్య, ఎండి హుస్సేన్, నాగిరెడ్డి, షేక్ ఇమ్రా, సెక్రటరిలుగా రంగారావు, పండు రంగం పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్ 1 పరీక్ష

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ గ్రూప్ 1 ప్రాథమిక పరీక్ష ఆదివారం కూకట్‌పల్లిలో ప్రశాంతంగా జరిగింది. కూకట్‌పల్లి జంట సర్కిల్‌ల పరిధిలోని 8 సెంటర్లను ఏర్పాటు చేశారు. మొత్తం అభ్యర్థులు 3360 మంది హాజరు కావాల్సి ఉండగా 1986 మంది హాజరు కాగా 1374 మంది గైర్హాజరు అయ్యారు. గంట ముందే పరీక్ష కేంద్రానికి అనుమతి ఇచ్చారు. దీంతో అభ్యర్థులు సమయానికి కేంద్రాలకు చేరుకున్నారు. ముగ్గురు అభ్యర్థులు అరగంట ఆలస్యం కావటంతో వారిని పరీక్షకు అనుమతి ఇవ్వకపోవటంతో వారు తిరిగి వెళ్లి పోయారు. ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా కూకట్‌పల్లి పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. ఆయా పరీక్షా కేంద్రాలను కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, సిఐ సురేందర్ గౌడ్, పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు.

శిల్పారామం సందర్శన వేళలు

గచ్చిబౌలి: మాదాపూర్‌లోని శిల్పారామం ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. వారాంతంలో సాయంత్రం 5.30 గంటల నుంచి శిల్పారామంలోని ఆంపీథియేటర్‌లో సందర్శకుల కోసం సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఫీజుల ఇలా

పెద్దలకు రూ.60
పిల్లలకు. రూ.20
బోటింగ్ ఛార్జీలు రూ.30
◆ బ్యాటరీ ఆపరేటెడ్ కారు చార్జీలు రూ.15
◆ ఎడ్లబండి ఒక్కరికి ఛార్జీలు.....రూ.20

భూపతిరెడ్డికి పలువురి జన్మదిన శుభాకాంక్షలు



భారీ గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు..

దుండిగల్: టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఆయనతో కేక్ కట్ చేయించి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్,మేడ్చల్, మెదక్, మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్, తిరుపతి రెడ్డి, జి.మధుసూదన్ రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలి



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: పాపారెడ్డి నగర్ కాలనీ శ్రీ వీరాంజనేయ శివాలయం ప్రాంగణంలోని కమ్యూనిటీ హాలులో ఆదివారం పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత రక్త దాన శిబిరం, ఉచిత ఆరోగ్య శిబిరాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, నార్నే శ్రీనివాసరావు, సిఐ క్రాంతి కుమార్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు సేవ చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్ఎన్‌సి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ రమేష్, వివేకానందనగర్ డివిజన్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలి



మోతీనగర్ కమ్యూనిటీ హాలులో వృద్ధులకు ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం

మోతీనగర్: వయోవృద్ధులు తరచూ వైద్యులను సంప్రదించి ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించుకొని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్‌చైర్మన్ డాక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం మోతీనగర్‌కమిటి హాలులో ఎంసీఏ సాయిప్రసాద్ సేవా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో వయో వృద్ధులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 మంది వయో వృద్ధులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు అంజిరెడ్డి మాట్లాడుతూ వయోవృద్ధులు చిన్నపిల్లలతో సమానమని వారికి తరచు వైద్య పరీక్షలు చేయిస్తూ వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ప్రతి ఆదివారం మోతీనగర్‌కమ్యూనిటి హాలులో నిర్వహించే ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బి. జగన్నాథం గౌడ్, పిఎస్‌రెడ్డి, ఈ బ్రహ్మానంద రెడ్డి, సూర్యనారాయణ శర్మ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ మారిపోయింది..

మోడల్ మార్కెట్‌లో వార్డు కార్యాలయం ఏర్పాటు



జగద్గిరిగుట్ట: దేనికైనా టైం రావాలంటారు. గత 3 సంవత్సరాలుగా ఖాళీగా ఉండి, మొన్నటివరకు అసాంఘిక కార్యకలాపాలకు, వాహనాల పార్కింగ్ అడ్డాగా ఉన్న జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్ప సమీపంలోని మోడల్ మార్కెట్ ఇపుడు మారిపోయింది. కేవలం 20 రోజులలో ఈ మోడల్ మార్కెట్ మార్కెట్ రూపురేఖలు మారిపోయాయి.

◆ ప్రజలకు చేరువయ్యేందుకు ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ పరిదిలోని అన్ని వార్డులలో కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నది.

◆ ఇందులో భాగంగా జగద్గిరిగుట్ట 126 డివిజన్‌కు ఎప్పటినుండో ఖాళీగా ఉన్న మోడల్ మార్కెట్ ను వార్డు కార్యాలయంగా ఏర్పాటు చేమనున్నారు.

◆ సుమారు 10 లక్షలతో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్నటువంటి 4 షటర్ల స్థలంలో ఏర్పాటు చేయనున్న ఈ వార్డు కార్యాలయానికి పెయింటింగ్, ఫర్నిచర్, తదితర సామాగ్రితో దాదాపు ఏర్పాట్లు పూర్తి చేసారు. అతి త్వరలోనే ప్రారంభం కానుంది.

◆ ఇదే భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో 2 షటర్ల స్థలంలో గత నెల ఎమ్మెల్యే వివేకనంద్ బస్తీ వావాఖాన ప్రారంభించారు.

◆ దాదాపు గ్రౌండ్ ఫ్లోర్‌లో షటర్లు అన్ని వాడుకలోకి రాగా ఫస్ట్ ఫ్లోర్‌లో గత నెల గాజులరామారం ఓ షట్టర్‌లో డీసీ ప్రశాంతి ఆర్ఆర్ఆర్ ప్రారంభించింది.

◆ ఇంకా మూడు షటర్లు ఖాళీగా ఉండగా, సోమయ్యనగర్‌లో నిర్వహిస్తున్న టీకా కేంద్రాన్ని ఇందులోకి మార్చాలని డిమాండ్‌లో ఉండగా పరిశీలనలో పెట్టారు.

◆ ఈ మోడల్ మార్కెట్‌కి ఎన్నో సార్లు టెండర్లు పిలిచినా ఎవరు ముందుకు రాకపోవడం, గత 3 సంవత్సరాలుగా ఖాళీగా ఉండి, ఇలా ప్రజా అవసరాల కోసం ఉయోగంలోకి తెచ్చే విధంగా గత 20 రోజుల వ్యవదిలోనే రూపురేఖలు మారిపోవడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



20 రోజుల క్రితం ఇలా..